క్లుప్తంగా

పుస్తకావిష్కరణ



నెల్లూరు(బృందావనం) : పురమందిరం ప్రాంగణంలోని ఏసీ హాల్లో సుధామురళి కవిత్వం 'తడి ఆరని వాక్యమొక్కటి' పుస్తకావిష్కరణను ఆదివారం చేశారు. పుస్తక సమీక్షను శ్రీరామ్ పుప్పాల, ఫణిమాధవి కన్నోజు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలు ముక్కామల చక్రధర్, సుంకరగోపాల్, సరసిజ పెనుగొండ, ఈతకోట సుబ్బారావు, పెరుగు రామకృష్ణ, ప్రసేన్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ మైదానంలో శంకుస్థాపన

నెల్లూరు (టౌన్) : స్థానిక 54వ డివిజన్‌లోని జెడ్పీ పాఠశాల మైదానంలో విద్యార్థులు ఆడుకునేందుకు వివిధ కోర్టులకు మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదివారం శంకుస్థాపన చేశారు. పాఠశాలలకు ప్రహరీతో పాటు విద్యార్థులకు ఆడుకునేందుకు వివిధ రకాల ఆట వస్తువులను కూడా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. త్వరలో ప్రహరీ నిర్మాణానికి టెండర్లు పిలవనున్నట్లు వెల్లడించారు. పాఠశాలలో చిన్నచిన్న మరమ్మతులను కూడా పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

6న పుష్పయాగం

నెల్లూరు(బృందావనం) : నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో ఈనెల 6వ తేదీన అమ్మవారికి పుష్పయాగాన్ని నిర్వహించనున్నట్లు ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు. పుష్పయాగం ఆహ్వాన పత్రికలను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు తరలిరావాలని కోరారు. ఆలయ అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

తోటల్లోనే నిమ్మకాయలు

పొదలకూరు: ఈ ప్రాంతంలో నిమ్మ సాగు అధికంగా ఉంది. ప్రస్తుతం కాయలు కోయకుండా రైతులు నష్టపోతున్నారు. ధరలుంటే పిందెలను కోసి మార్కెట్‌కు పంపడం.. ధరలు పెరుగుతాయనే సమాచారం ఉంటే తోటల్లోనే కాయలను ఉంచుకోవడం అలవాటుగా మారింది. దీంతో సకాలంలో కోతకు వచ్చిన కాయలను మార్కెట్‌కు తరలించకుండా నష్టాలను చవిచూస్తున్నారు. మార్చి నెలలో ధరలు పెరుగుతాయని రైతులు భావించి కోతకు వచ్చిన కాయలను కూడా తోటల్లోనే ఉంచారు. ఫలితంగా పండిపోయి రాలిపోతున్నట్టుగా తెలుస్తోంది. ఇందువల్ల మార్కెట్‌కు సైతం కాయలు ఆశించిన స్థాయిలో పంపుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. సంక్రాంతి నుంచి రైతులు తోటల్లో కాయలను సక్రమంగా కోయకుండా ఉంచారు. దీంతో గ్రీన్ కలర్ (పచ్చివి) కాయలు ఎల్లో కలర్ (పండువి)గా మారడంతో ఎగుమతులకు పనికిరాక వ్యాపారులు ఆశించిన స్థాయిలో ధరలను చెల్లించలేకపోతున్నారు. ఈ తంతు ప్రతి ఏడాది జరుగుతున్నా రైతులు గుర్తించలేకపోతున్నట్టు తెలుస్తోంది. పచ్చికాయలు పండ్లుగా మారుతున్న సమయంలో మార్కెట్‌కు హడావుడిగా తరలిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో నిమ్మకాయలు ఒక కిలో రూ.40 నుంచి రూ.60 వరకు ఉంది. గతేడాది టాప్ ధర కిలో రూ.80 వరకు పలికింది. సాధారణంగా నిమ్మ దిగుబడి మార్చి, ఏప్రిల్ నెలల్లో అధికంగా ఉంటే రైతులకు ధరలు లభించి ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. ఈ పరిస్థితి అన్ని తోటల్లో ఉండకపోగా కొందరు రైతులకు ధరలున్న సమయంలో దిగుబడి కూడా ఉండదు. కోతకు వచ్చిన కాయలను మార్కెట్‌కు తరలిస్తే ఉన్న ధరలైనా దక్కుతాయని తోటల్లో ఉంచుకోవడం వల్ల రాలిపోయే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మార్చి ప్రారంభంలో ధరలు తక్కువగానే ఉన్నాయి.

నేత్రపర్వం.. రథోత్సవం



బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి పట్టణంలోని రామకృష్ణనగర్‌లో వెలసిన వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్ల రథోత్సవం ఆదివారం వేలాది మంది భక్తుల నడుమ గోవిందనామ స్మరణ మధ్య వేడుకగా సాగింది. తొలుత శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామిని ప్రత్యేక రథంపై కొలువుదీర్చారు. ప్రత్యేక పూజలనంతరం ఉదయం 9.50 గంటలకు రథోత్సవం మొదట చెన్నూరు రోడ్డు మీదుగా వైఎస్సార్ కూడలి వరకు సాగి తిరిగి చెన్నూరు రోడ్డు మీదుగానే కొత్త బస్టాండుకు చేరుకుంది. రథోత్సవానికి ముందు భారీ ఎత్తున ఆధ్యాత్మిక పాటలు, భజనలతో భక్తులు సాగారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

అశ్వవాహనంపై ఊరేగిన శ్రీవారు

రథోత్సవం అనంతరం రాత్రి అశ్వవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా స్వామివార్లకు సోమవారం చక్రస్నానం నిర్వహించనున్నారు.

జూనియర్లదే పెత్తనం

- సీనియర్లకు ప్రాధాన్యత లేని విభాగానికి పోస్టింగ్
- అనుభవం లేని వారికి కీలక బాధ్యతలు
- ఫలితంగా కార్పొరేషన్ సేవలు మందగమనం



నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు నగర ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మున్సిపల్ కార్పొరేషన్(ఎన్ఎంసీ) కీలకంగా వ్యవహరిస్తోంది. స్థానికంగా ఉన్న ఎన్ఎంసీ కార్యాలయంలో పలు విభాగాలున్నాయి. ఇందులో ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్(శానిటేషన్), అకౌంట్స్, ఎస్టాబ్లిష్‌మెంట్, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ విభాగాలు కీలకంగా పని చేస్తుంటాయి. వీటి ద్వారా పట్టణ ప్రజలకు అవసరమైన సేవలను అందిస్తుంటారు. అయితే ఇందులో సీనియర్ అధికారులైన పలువురు సూపరింటెండెంట్లకు ప్రాధాన్యత లేని పోస్టులను అప్పగించడం, జూనియర్‌లుగా ఉన్న సూపరింటెండెంట్లకు కీలకమైన పోస్టుల్లో నియమించడంతో పాటు అదనపు బాధ్యతలు కూడా అప్పగించారు. దీంతో ప్రజలకు మెరుగైన సేవలు సకాలంలో సక్రమంగా అందడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా..

ఎన్ఎంసీలోని కీలకమైన విభాగాల్లో సూపరింటెండెంట్ల పోస్టులకు సీనియర్లను కేటాయించాల్సి ఉంది. అలా కాకుండా నిబంధనలకు విరుద్ధంగా కీలక విభాగాల్లోని సూపరింటెండెంట్ పోస్టుల్లో జూనియర్లుగా ఉన్న వారిని కేటాయించడంతో పాటు వారికే అదనపు బాధ్యతలు కూడా అప్పగించడం విశేషం.

ఇలా జరుగుతోంది

ఎన్ఎంసీలో మేనేజర్ పోస్టు కీలకం. దీనిని సీనియర్ సూపరింటెండెంట్ అయిన అధికారికి అప్పగించాల్సి ఉండగా అతన్ని మున్సిపల్ జూనియర్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా నియమించి జూనియర్ సూపరింటెండెంట్ అయిన ఓ ఉద్యోగికి మేనేజర్ పోస్టుతో పాటు అదనంగా రెవెన్యూ ఆఫీసర్(ఆర్వో) బాధ్యతలు కేటాయించారు. దీని వల్ల ఎన్ఎంసీ కార్యాలయంలోనే ఉంటూ మేనేజర్‌గా విధులు నిర్వర్తించాల్సిన అధికారికి రెవెన్యూ అధికారి పోస్టును కూడా అప్పగించడంతో బయట పన్నుల వసూళ్ల ప్రక్రియ పర్యవేక్షణను పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోతున్నారని కార్యాలయ ఉద్యోగులే చర్చించుకుంటున్నారు. అలాగే మరో ముగ్గురు సీనియర్ సూపరింటెండెంట్లలో ఇద్దరిని శానిటరీ సూపర్‌వైజర్లుగా నియమించారు. మరో సూపరింటెండెంట్‌ను రెవెన్యూ విభాగంలో సూపరింటెండెంట్‌గా నియమించారు. అదేవిధంగా మరో సూపరింటెండెంట్‌కు అకౌంట్స్ విభాగంలో సూపరింటెండెంట్‌గా నియమించి అదనంగా అకౌంటెంట్‌గా కూడా విధులు నిర్వర్తించేలా బాధ్యతలు అప్పగించారు. ఎంతో కీలకమైన అకౌంటెంట్ విభాగంలో ఒకే అధికారికి రెండు బాధ్యతలు అప్పగించడం మరొక విశేషం. ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగానికి సూపరింటెండెంట్‌గా నియమించిన ఉద్యోగికి అదనంగా లీగల్‌సెల్ విభాగానికి సూపరింటెండెంట్‌గా కూడా బాధ్యతలు అప్పగించారు. అంతేకాకుండా ఇటీవల వెంకటగిరి కమిషనర్‌గా పనిచేస్తూ ఎన్ఎంసీకి బదిలీ అయిన సీనియర్ సూపరింటెండెంట్‌కు అంతగా ప్రాధాన్యత లేని టీపీఆర్వో పోస్టును కేటాయించినట్లు సమాచారం. అయితే ఆయన పలు మున్సిపాలిటీల్లో కమిషనర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. అలాంటి అధికారికి ప్రాధాన్యత లేని విభాగానికి సూపరింటెండెంట్‌గా కేటాయించడం విశేషం.

కమిషనర్ దృష్టి సారించాలి

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్న ఆలోచనతో కమిషనర్ సూర్యతేజ ఇటీవల పరిపాలన యంత్రాంగంపై ప్రత్యేక దృష్టిపెట్టి ప్రక్షాళను చేస్తూ, పలు చర్యలు చేపడుతున్నారు. అయితే ఆయన మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. కొందరు ఉద్యోగులు తప్పుడు సమాచారంతో ఆయన్ను తప్పుదోవ పట్టిస్తున్నట్లు సమాచారం. ఇకనైనా కమిషనర్ వాస్తవాలు గ్రహించి ఎన్ఎంసీ కార్యాలయంలోని కీలకమైన విభాగాల్లో సీనియర్ సూపరింటెండెంట్‌లకు తగిన ప్రాధాన్యత కల్పించి అర్హత కలిగిన పోస్టులు కేటాయించాల్సిన అవసరం ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

- ఏఎస్పీ సౌజన్య



మ్యూజికల్ చైర్ ఆడుతున్న మహిళా పోలీసులు

నెల్లూరు(క్రైమ్) : యోగా ద్వారా ఒత్తిడిని దూరం చేయడంతో పాటు ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో మహిళా పోలీసులకు యోగాసనాలు, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యాలను పెంపొందించడంలో యోగా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. యోగాలో ధ్యానమూ ఒక భాగమన్నారు. ధ్యానం చేయడం ద్వారా జీవనశైలిలో ఎన్నో మార్పులు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మహిళా పోలీసులు, మహిళా సంరక్షణ కార్యదర్శులకు యోగా గురువు, హెడ్‌కానిస్టేబుల్ మురళీ యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి వారిచేత యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో నగర డీఎస్పీ పి.సింధుప్రియ, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, నెల్లూరు నగర, రూరల్ మహిళా పోలీసులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆనంతో కార్యకర్తల భేటీ



ఆనం విజయకుమార్‌రెడ్డితో 20వ డివిజన్ పార్టీ నేతలు

నెల్లూరు(బారకాసు) : రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో 20వ డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్యకర్తల సమస్యలపై చర్చించారు. పార్టీ బలోపేతం దిశగా పనిచేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, రూరల్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, వాసంతి రెడ్డి, మైనార్టీ నేత రసూల్, పార్టీ నేతలు చెవిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఎస్.మధుసూదన్, పి.శ్రీహరిరెడ్డి, బి.రూప్‌కుమార్, యు.రమణారెడ్డి, పి.మురళి, కె.ప్రసన్న, కె.ఏడుకొండలు, పుట్టా రమేష్, పి.దొరసాని, పి.చైతన్య, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి రంగడి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు(బృందావనం) : సింహపురి క్షేత్రపాలకుడు రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 9 నుంచి 20వ తేదీ వరకు జరుగనున్నాయని దేవస్థానం ఈఓ అళ్ల శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలు, వాల్‌పోస్టర్లను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9వ తేదీ సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతుందని, ఇలా 20వ తేదీ వరకు వివిధ పూజలు, అభిషేకాలు, ఊరేగింపులు ఉంటాయన్నారు. భక్తులు విశేషంగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు వెంకయ్య, పొంగూరు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నారాయణా.. ఇదేనా భక్తి..?

- షూస్ వదలకుండా.. బ్రహ్మోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు(బృందావనం): ప్రసాదాల స్వీకరణ.. దైవ సంబంధిత కార్యక్రమాలు ఎక్కడ జరిగినా సంప్రదాయానికి ప్రతి ఒక్కరూ పెద్దపీట వేస్తారు. తమ చెప్పులు విడిచి.. ఆచార వ్యవహారాలకు అనుగుణంగా నడుచుకుంటారు. అయితే రాష్ట్ర మంత్రి నారాయణ ఇందుకు భిన్నంగా వ్యవహరించడం చర్చనీయాంశమైంది. శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలు, పోస్టర్లను నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఆ సమయంలో షూస్ తీయకుండా వ్యవహరించడం అక్కడున్న కొందర్ని ఆశ్చర్యానికి గురిచేసింది. కూటమి ప్రభుత్వంలో సనాతన ధర్మానికి ఇచ్చే విలువ ఇదేనాననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వేడుకగా అలకలతోపు



నెల్లూరు(బృందావనం) : మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి అలకలతోపు ఉత్సవం వేడుకగా నిర్వహించారు. ఉదయం చప్పరోత్సవం కనుల పండువగా జరిగింది. అలకలతోపు ఉత్సవం సందర్భంగా అమ్మవారు పులివాహనంపై, స్వామివారు వెండి నందివాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తగా సీఎస్వీ సుబ్రహ్మణ్యం వ్యవహరించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

రూరల్ నాయకులతో ఎమ్మెల్యే సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ : రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 9న ఒకేరోజు 105 పనులకు శంకుస్థాపన చేసే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ఇందులో 51 చోట్ల స్వయంగా పాల్గొంటున్నట్లు తెలిపారు. మిగిలిన చోట్ల కూటమి నేతలతో కలిసి నా సోదరుడు గిరిధర్‌రెడ్డి పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



నెల్లూరు(సెంట్రల్) : నగరంలోని 54వ డివిజన్‌లో నిర్వాసితులకు ఇళ్ల పట్టాలను మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది పెన్నా తీర ప్రాంతం వెంకటేశ్వరపురం వద్ద వంతెన నిర్మాణం కోసం పలువురి ఇళ్లను తొలగించామని, ఇందులో భాగంగా 126 మంది నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామన్నారు.

వాకర్స్‌కు వైద్యసేవలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యసేవలను ఆదివారం అందించారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు పాబోలు సత్యం ఆధ్వర్యంలో వైద్యులు సత్యనాథ్, శ్రీనివాస కుమార్, కృష్ణమూర్తి, శ్రీధర్‌రెడ్డిలు 300 మంది వాకర్స్‌కు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్నేహ సురేష్ మాట్లాడుతూ కిలారి వెంకటస్వామి నాయుడు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సౌజన్యంతో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. పూర్వ అధ్యక్షుడు వేలూరు రంగారావు, కనకట్ల రఘురామ్‌ముదిరాజ్, బాసం శేషగిరిరావు, అరిగెల సాయి, బాదం హరికృష్ణ, శేగు రమేష్, బాలసుధాకర్ పాల్గొన్నారు.

జనతా వాకర్స్ కార్యవర్గ ఎన్నిక



మాట్లాడుతున్న రాధాకృష్ణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : జనతా వాకర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నగరంలోని చిల్డ్రన్స్‌పార్క్ వద్ద ఉన్న ఆదిత్య కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా ముక్కు రాధాకృష్ణగౌడ్, ప్రధాన కార్యదర్శులుగా పాలిచెర్ల ఉదయ్‌కుమార్, కాయల మధు, ఉపాధ్యక్షులుగా దామెర్ల శివకుమార్, తిరకాల శివగౌడ్, జి.వెంకటేశ్వరరెడ్డి, తులసి, దుష్యంత్, కార్యదర్శులుగా తణుకు మునిబాబు, పవన్‌కుమార్ గౌడ్, ప్రత్యూషారెడ్డి, కట్టా సురేందర్‌రెడ్డి, కోశాధికారిగా ఆకిలి వెంకటభానుకిరణ్, న్యాయ సలహాదారుగా నాయబ్‌రసూల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలను చేపడుతామన్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ మహోత్సవం



పండరి భజనలో పాల్గొన్న వారితో గురువు లక్ష్మీసాయి



అగ్నిగుండం తొక్కుతున్న మహిళలు

నెల్లూరు(బృందావనం) : పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరానికి సమీపంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు సాయినాథస్వామి, పాండురంగస్వామివారి ఆనంద అగ్నిగుండ మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. పండరిభజన గురువు లక్ష్మీసాయి ఆధ్వర్యంలో భజనలు వేడుకగా సాగాయి. జిల్లా నలుమూలల నుంచి 500 మందికిపైగా భక్తులు పండరిభజనల్లో పాల్గొన్నారు. ప్రధానంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి అవతారం, కృష్ణలీలలు, ఘోరా కుంభార్ ఘట్టం, ఉగ్ర నరసింహస్వామి దండకం విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను మందిర కమిటీ మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి, గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య, గురువులు కొల్లపూడి శ్రీను, తులసిరాం, సాయిభక్తబృందం సభ్యులు పాల్గొని పర్యవేక్షించారు.

నెల పాటు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు



పోస్టర్లను ఆవిష్కరించిన ఆస్పత్రి వైద్యులు, బాధ్యులు

నెల్లూరు(అర్బన్) : నగరంలోని నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తిస్థాయి ఆంకాలజీ(కేన్సర్) సేవలను ప్రారంభించామని, దీనిలో భాగంగా నెల రోజుల పాటు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నట్లు నారాయణ వైద్య, విద్యాసంస్థల కో–ఆర్డినేటర్ డాక్టర్ బిజా రవీంద్రన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం ఆస్పత్రిలో కేన్సర్ విభాగాన్ని ప్రారంభించి, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే నెల 2వ తేదీ వరకు మహిళలకు రూ.5,100 విలువ చేసే అబ్డామిన్–పెల్విస్ స్కాన్, సీబీపీ, చెస్ట్ ఎక్స్‌రే, మోమోగ్రామ్, పాప్‌స్మియర్, సీఏ 125 పరీక్షలతో పాటు గైనకాలజీ, డెంటిస్ట్ కన్సల్టేషన్, అలాగే పురుషులకు అబ్డామిన్ స్కాన్, ఎక్స్‌రే, సీబీపీ, పీఎస్ఏ, కేన్సర్ స్పెషలిస్టు, డెంటిస్ట్ కన్సల్టేషన్ పరీక్షలను ఉచితంగా చేస్తున్నామన్నారు. మెడికల్ ఆంకాలజిస్ట్ శ్రీవిద్య, సర్జికల్ ఆంకాలజిస్ట్ మనోభిరామ్, రేడియేషన్ ఆంకాలజిస్ట్ గురుసాయిరత్నప్రియ, రెడ్‌క్రాస్ చైర్మన్ విజయకుమార్‌రెడ్డి, రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



కృష్ణగాన మంజరిలో పాల్గొన్న విద్యార్థులు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పుర మందిరంలో సంగీత విద్వాంసురాలు అనంతబొట్ల రమాదేవి ఆధ్వర్యంలో ఆదివారం కర్ణాటక సాంప్రదాయ భక్త సంగీత విభావరి 'కృష్ణ గానమంజరి' ఆద్యంతం ప్రతిఒక్కరిని అలరించింది. శ్రీభారతి సంగీత విద్యాలయం 17వ వార్షికోత్సవం సందర్భంగా 28 మంది విద్యార్థులు పాల్గొని తమ పాటలతో అలరించారు. భజనలు, నామసంకీర్తనలు తదితర కార్యక్రమాలు వేడుకగా సాగింది. అనంతరం రమాదేవి మాట్లాడుతూ ఆధునిక సంగీత ప్రక్రియలతో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సంగీత విభావరిలో వ్యాఖ్యాతగా ఏవీఆర్ కిశోర్ వ్యవహరించారు. కార్యక్రమాన్ని దువ్వూరు బెనర్జీ, కళాంజలి అనంత్ పర్యవేక్షించారు. కంచికామకోటి పీఠ ఆస్థాన విద్వాంసులు ముల్లైవాసల్ డాక్టర్ జి.చంద్రమౌళి ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు.